

తాగు నీటి ఎద్దడి రాకుండా
ముందస్తు చర్యలు...
కలెక్టర్ కోయ శ్రీ హర్ష 7

ఖమ్మంపల్లి-భూపాలపల్లికి రోడ్డుకు
రూ.33.70 కోట్లు 7

- బసంత్‌నగర్‌లో స్థలం విమానాశ్రయానికి అనువుగా లేదు
- రిపోర్ట్ ఇచ్చిన ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా
- ఎంపీ లేఖకు సమాధానం ఇచ్చిన కేంద్ర మంత్రి

ఆశలు గల్లంతు



బసంత్ నగర్ మినీ ఎయిర్ పోర్టు వద్ద క్యాబిన్

బసంత్ నగర్ ఎయిర్ పోర్టు స్థలం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి జిల్లా దాని చుట్టుపక్కల గల జిల్లాల ప్రజలకు విమానాశ్రయం ఆశలు గల్లంతయ్యాయి. బసంత్ నగర్ మినీ ఎయిర్ పోర్టును రామగుండం ఎయిర్‌పోర్టుగా ఏర్పాటు చేయాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ గత ఏడాది నవంబర్ 27న కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకు లేఖ ఇచ్చిన విషయం తెలిసిందే. లేఖను పరిశీలించిన మంత్రి బసంత్‌నగర్ మినీ ఎయిర్‌పోర్టును విమానాశ్రయంగా ఏర్పాటుకు అవకాశం లేదని ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నివేదిక ఇచ్చిందని ఎంపీకి ఈ ఏడాది జనవరి 29వ తేదీన పంపిన లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఎత్తైన గుట్టలు ఉండడంతోపాటు రామగుండం ప్రాంతం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పరిధిలో ఉందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఎయిర్ ఫోర్స్ అకాడమీ ఫ్లయింగ్ శిక్షణ కూడా రామ గుండం ప్రాంతంలోని గగనతలంలో జరుగుతున్న దని పేర్కొన్నారు. ఒకవేళ ఇక్కడ ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేయాల్సి వస్తే కేంద్ర రక్షణ శాఖ అనుమ తులు తీసుకోవాల్సి ఉంటుందని ఆ లేఖలో పేర్కొ న్నారు. 2008 గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు పాలసీ ప్రకారం దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం గ్రీన్ ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి అనుకూలంగా ఉంది. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని పేర్కొన్నారు.

● బసంత్‌నగర్‌లో ఇదివరకే మినీ ఎయిర్ పోర్టు

బసంత్‌నగర్‌లో యాభై ఏళ్ళ క్రితం మినీ ఎయిర్‌పోర్ట్ నిర్మించారు. బసంత్‌నగర్‌లో బిర్లా కేశోరామ్ సంస్థ సిమెంట్ ఫ్యాక్టరీని నిర్మించింది. అయితే ఈ ఫ్యాక్టరీని పరిశీలించేందుకు బిర్లా వచ్చేం దుకు వీలుగా సుమారు 400 ఎకరాల్లో మినీ ఎయిర్ పోర్టును కేశోరామ్ సంస్థ సొంతంగా నిర్మించింది. ఈ ఎయిర్‌పోర్టులో ఇతర మినీ విమానాలకు అవకాశం లేదు. కాలక్రమేణా ఈ ఎయిర్‌పోర్ట్ ఉపయోగంలో లేకుండా పోయింది. తెలంగాణ ప్రాంతంలో కేవలం హైదరాబాదులో మాత్రమే విమానాశ్రయం ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్‌తోపాటు వరంగల్ జిల్లా మామునూరు, నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి, రామగుండం ప్రాంతంలోని బసంత్‌నగర్, మరో మూడు చోట్ల ఎయిర్‌పోర్టులను ఏర్పాటు చేసేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించింది. అప్పటికే కేంద్ర ప్రభుత్వం సైతం దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న విమానాశ్రయాలకు తోడుగా మరో 150 విమానా శ్రయాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టు కుంది. అందులో భాగంగా వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిపుణులు ఆయా ప్రభు త్వాలు ప్రతిపాదించిన స్థలాలను పరిశీలించాయి. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం బసంత్‌నగర్ మినీ ఎయిర్ పోర్టును కూడా ప్రతిపాదించింది. 2017లో అప్పటి జిల్లా కలెక్టర్ ప్రస్తుతం ఉన్న మినీ ఎయిర్‌పోర్ట్ స్థలంతోపాటు మరో 600 ఎకరాలు అవసరం ఉంటాయని గుర్తించింది. ఇందులో కొంత అటవీ శాఖకు సంబంధించిన భూమితోపాటు ప్రభు త్వ భూమి కూడా ఉంది. అలాగే కుర్మపల్లి గ్రామంలో కొంత పట్టా భూమిని సేకరించాల్సి ఉంటుందని సర్వే ద్వారా అధికారులు తేల్చారు. అవసరమైన భూమిని ఎయిర్ పోర్టు నిర్మాణానికి స్థలాన్ని ఇచ్చేందుకు తాము అనుకూలంగా ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది.

● బసంత్‌నగర్‌ను సందర్శించిన ఏఏఐ బృందం

రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపించిన ప్రతిపాదనల మేరకు కేంద్రం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిపుణుల బృందం 2018లో, 2019లో బసంత్‌నగర్‌ను సందర్శించింది. పాత మినీ ఎయిర్ పోర్టు స్థలంతో పాటుగా, చుట్టుపక్కల గుర్తించిన స్థలాన్ని కూడా వారు పరిశీలించారు. ఈ ఎయిర్ పోర్టుకు సమీపంలోనే ఎత్తైన గుట్టలు ఉండడంతో పాటు, విద్యుత్ టవర్లు ఉన్నాయని ఎయిర్ పోర్టు ఏర్పాటుకు అనువైనది కాదని ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా నిపుణుల బృందం కేంద్ర ప్రభుత్వా

(మిగతా 8వ పేజీలో)

బాలికలకు నాణ్యమైన భోజనం అందించాలి



పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లి కల్చరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకులాలో చదివే బాలికలకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రంగంపల్లి కాలనీలో ఉన్న మహాత్మాజ్యోతిభాపూలే బీసీ బాలికల గురుకులాన్ని తనిఖీ చేశారు. డార్మెంటరీ, క్లాస్ రూం, పారిశుధ్య నిర్వహణ, భోజన హాల్, వంటగది పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి హాస్టల్లో అందిస్తున్న భోజనం నాణ్యత, విద్యాబోధన వివరాలను ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ గురుకులంలో విదార్థినులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. హాస్టల్‌కు వచ్చే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించాలన్నారు. బాలికలకు ప్రభుత్వం నిర్దేశించిన కామన్ మెనూను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే 10వ తరగతి పరీక్షల దృష్ట్యా స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. గురుకులంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్ ద్వారా ప్రతిపాదనలు తయారుచేసి పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఆమె పిల్లలతో కలిసి భోజనం చేశారు. బీసీ బాలికల గురుకులం ప్రిన్సిపాల్ మణీదీప్తి, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

యువత ఆలోచనలు కార్యరూపం దాల్చేందుకు

వీ-హబ్ సహకారం



వీ హబ్ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, మార్చి 11 (ఆంధ్ర జ్యోతి): యువత ఆలోచనలు కార్యరూపం దాల్చేందుకు వీ హబ్ సహకారం అందిస్తుం దని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళ వారం కలెక్టరేట్‌లో విద్యార్థులకు నిర్వహిం చిన ఐడియేషన్ బూట్ క్యాంపులో పాల్గొ న్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు జాబ్ చేసే ధోరణి నుంచి జాబ్‌లు సృష్టిం చాలనే లక్ష్యాలు నిర్దేశించుకోవాలని కలెక్టర్ తెలిపారు. చిన్నతనం నుంచి మనం పెరిగిన వాతావరణం ఒక మంచి జాబ్ దొరికితే లైఫ్ సెటిల్ అవుతుందనే ఆలోచన మనకు ప్రేరే పిస్తుందని, వీహబ్ ద్వారా యువతకు మరో వైపు గల అవకాశాలు, యువత ఆశయాలకు తోడ్పాటు అందిం చేందుకు చర్యలు చేపట్టా మన్నారు. స్విగ్గీ, ఓయో, రాపిడో, ఓలా వం టి వివిధ కంపె నీలు చిన్న చిన్న ఆలోచ నలతో ప్రారంభమయ్యాయన్నారు. యువత ఆలోచిస్తే సమాజంలో అనేక అవకాశాలు వస్తాయన్నారు. యువత ఆలోచనకు సపోర్ట్ చేసేలా వీహబ్‌లో ఎకో సిస్టం ఏర్పాటు చేశా మన్నారు. వీ హబ్ సంచాలకులు జహీద్ అక్తర్‌షేక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, స్టూడెంట్ ప్రోగ్రాం లీడ్ జై, ప్రాజెక్టు కోఆర్డినేటర్ సాయిరాం, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, జిల్లా పరిశ్రమల అధికారి కీర్తికాంత్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మురళి, గోదావరిఖని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఉష, విద్యార్థులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెం దిన సీఎంఆర్ఎఫ్, షాదీముబారక్ లబ్ధిదా రులకు మంగళవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చెక్కులను పంపిణీ చేశా రు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ కోసం 4,300 ఫైళ్ల ప్రభుత్వానికి పంపగా 2,590 మందికి రూ.6 కోట్ల 90 లక్షల విలువగల చెక్కులు పంపిణీ చేసినట్టు తెలిపారు. నిమ్స్‌లో ఉచిత వైద్యం కోసం 190 మందికి ఎల్‌వోసీలు ఇప్పించినట్టు తెలిపారు. పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, ముగ్గురు ఆర్థోపెడిక్ డాక్టర్లు పని చేస్తున్నారని తెలి పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, తహసీల్దార్ రాజయ్య, మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, చింతపండు సంపత్, నర్సింహారెడ్డి, మూల ప్రేమసాగర్ రెడ్డి, సదయ్య, శ్రీనివాస్, రాజేందర్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పోలీస్‌బాస్‌కు సమస్యల స్వాగతం

- కమిషనరేట్ పరిధిలో విచ్చలవిడిగా అక్రమ దందాలు
- నామమాత్రమైన టాస్క్‌ఫోర్స్
- గ్రామాల నుంచి నగరందాకా గంజాయే...

కోల్‌సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాకు పలు సమస్యలు స్వాగ తం పలుకుతున్నాయి. కమిషనరేట్‌లో అక్రమాలపై ఉక్కు పాదం మోపే టాస్క్‌ఫోర్స్ ప్రస్తుతం నామమాత్రమైంది. అడప దడప చిన్న చిన్న టాస్క్‌లతోనే సరిపెట్టుకుంటుంది. కమిష రేట్‌లోని చోరీలు, ఇతర నేరాల నియంత్రణ, ఛేదనలో కీలకమైన సీసీఎస్ కొన్నేళ్లుగా ఉనికే లేకుండా పోయింది. రామగుండం కమిషరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో అక్రమ దందాలు సాధారణమైపో యాయి. కోల్‌బెల్ట్ కావడంతో బొగ్గు చోరీలు, స్క్రాప్ దందాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణా, అక్రమ ఫైనాన్స్‌లు వంటివి అడ్డు అదుపు లేకుండా సాగుతున్నాయి. బొగ్గు చోరీలు, స్క్రాప్‌దందాలు, రేషన్‌బియ్యం ఆయా ఠాణాలకు నెలవారీ కొత్త ఆదాయ మార్గాలను తెచ్చిపెట్టే వనరులుగా మారాయి. గంజాయి కమిషరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో గ్రామాల నుంచి నగరం దాకా పాకింది. వాడవాడనా గంజాయి అమ్మకాలు, వినియోగం పెరిగింది. యువత మత్తులో ఊగుతూ నేరాలకు పాల్పడుతున్నారు.

● ఎస్‌బీలో వివాదాస్పదులకు బాధ్యతలు

పోలీస్ ఉన్నతాధికారులకు స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ)నే కళ్లు, చెవులుగా పని చేస్తాయి. కమిషనరేట్ పరిధిలో పోలీస్ బాస్‌కు ఉన్నా గూఢాచారి వ్యవస్థనే ఎస్‌బీ. సమాజంలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు కమిషనర్‌కు చేరవేయాల్సి ఉంటుంది. కమిషన రేట్ పరిధిలోని దందాలు మొదలు నేరాలు జరిగే పరిస్థితులు నేరస్థుల కదలికలను ఆరా తీస్తారు. ముఖ్యంగా పోలీస్‌స్టేషన్ల, సిబ్బంది, అధికారుల పని తీరుపై కూడా నిఘా పెట్టి సమాచారాన్ని చేరవేరుస్తారు. రామగుండం కమిషనరేట్‌లోని ఎస్‌బీలో ఫీల్డ్ ఆఫీసర్లలో కొందరు అర్హత లేని వారు, వివాదాస్పదులకు బాధ్యతలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. గొడవలు, ముందస్తు సమాచారం సేకరించడంలో విఫలమవుతున్నారనే అపవాదు ఉంది.

● నామమాత్రమైన టాస్క్‌ఫోర్స్

కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో టాస్క్‌ఫోర్స్ టీములు పని చేస్తున్నాయి. ఏసీపీ, సీఐలు, ఎస్ఐలతో పూర్తి స్థాయిలోనే టాస్క్‌ఫోర్స్ ఉంది. టాస్క్‌ఫోర్స్ పూర్తిగా కమిషనర్ కంట్రోల్‌లో పని చేయాల్సి ఉంటుంది.



రామగుండం పోలీస్ కమిషనరేట్

కమిషనరేట్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో అక్రమ దందాలపై టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం మోపాల్సి ఉంటుంది. అడపదడప చిన్న చిన్న దాడులు చేయడం, పేకాటలు, చిన్న మొత్తం రేషన్ బియ్యం పట్టుకోవడంతోనే సరిపెట్టుకుంటుంది. ఠాణాల పరిధిలో అక్రమ దందాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. తెలిసి కూడా దాడులు చేయలేని అచేతన అవస్థకు టాస్క్‌ఫోర్స్ చేరిందనే ఆరోపణలు ఉన్నాయి.

● అక్రమ దందాలకు అడ్డూఅదుపు లేదు...

కమిషనరేట్ పరిధిలోని పలు ఠాణాలు ఫోకల్ పాయింట్లుగా ఉన్నాయి. బొగ్గు చోరీలు, అక్రమ రవాణా, స్క్రాప్ దందా, గంజాయి, రేషన్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా, పేకాట స్థావరాలు, డీజిల్ చోరీలు వంటి దందాలు సాగుతున్నాయి. ఈ దందాలు పలు ఠాణాలకు నెలవారీ ఆదాయ మార్గాలుగా మారాయి. ఎన్‌టీపీసీకి సింగరేణి గనుల నుంచి వెళ్లే బొగ్గును చోరీ చేసి లారీలకు లారీల లోడ్లు మాఫియా అమ్ముతుంది. గతంలో వీరిపై పీడీ యాక్టులు పెట్టినా పోలీసులు పిలిచి మందలించిన పరిస్థితులు లేవు. కోల్‌బెల్ట్ ప్రాంతమైన గోదావరిఖని, ఎన్‌టీపీసీ, ఫైటింక్లయిన్‌కాలనీతో పాటు శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి తదితర ప్రాంతాల్లో స్క్రాప్ దందా జోరుగా సాగుతోంది. ఒక గోదావరిఖని, ఎన్‌టీపీసీ ప్రాంతంలోనే 70కిపైగా స్క్రాప్ దుకాణాలు ఉన్నాయంటే పరిస్థితిని అంచనా వేయవచ్చు. సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్‌ల నుంచి లక్షల విలువైన సామాగ్రిని ఎత్తుకెళ్లడం, స్క్రాప్‌గా మార్చి తరలించడం నిత్యకృత్యమయ్యాయి. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఒక ఠాణాకు స్క్రాప్ అక్రమ వ్యాపారుల నుంచే నెలకు రూ.60వేల మామూళ్లు ఉన్నాయంటే పరిస్థితిని అంచనా వేసుకోవచ్చు. స్క్రాప్ వ్యాపారులే పిన్ పాయింట్లుగా రేషన్ దందా సాగుతున్నట్లు సమాచారం.

● ఠాణాల్లో క్రైమ్‌కో రేటు...

రామగుండం కమిషరేట్ పరిధిలోని పలు ఠాణాల్లో క్రైమ్‌కో రేటు అనే అవినీతి సాగుతుంది. క్రైమ్ ప్రివెన్షన్, ఇన్వెస్టిగేషన్, డిటెన్షన్ విధుల నుంచి రాను రాను తప్పుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అడ్డుపెట్టుకుని ఠాణాల్లో క్రైమ్‌కు ఒక రేటు కట్టి స్టేషన్ బెయిళ్లు, కేసుల నుంచి పేర్లు తీసివేయడం వంటి వాటికి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. క్లర్కుల నుంచి ఎస్‌హెచ్‌ఓల వరకు ఠాణాల్లో వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. చివరికి ఫిర్యాదుదారుల నుంచి కూడా ఏదో రూపంలో డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

● సామాజిక మహమ్మారిగా గంజాయి...

రామగుండం కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాల్లో గంజాయి సామాజిక మహమ్మారిగా మారింది. గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్రతీ ప్రాంతంలో గంజాయి దందా సాగుతుంది. పాఠశాల స్థాయి విద్యార్థుల నుంచి కళాశాల విద్యార్థులు, కాలనీల్లో యువకులు గంజాయికి బానిసవుతున్నారు. పోలీసులు రామగుండం మీదుగా రవాణా అయ్యే గంజాయిని పట్టుకున్నా గంజాయి విక్రయాలు, రవాణా, వినియోగాన్ని నియంత్రించ లేకపోతు న్నారు. కొన్ని స్టేషన్ల పరిధిలో గంజాయి విక్రయాలపై ప్రత్యేక పోలీసులకు సమాచారం ఉన్నా చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

● రాజకీయ ముసుగులో ల్యాండ్ మాఫియా

రామగుండం కమిషనరేట్ పరిధిలో ల్యాండ్ మాఫియా కార్యకలాపాలు పోలీస్‌శాఖకు సవాల్‌గా మారాయి. మంచిర్యాల, రామ గుండం పారిశ్రామిక ప్రాంతంలో నిత్యం ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. రాజకీయ ముసుగులో ల్యాండ్ మాఫియా దందాలు సాగిస్తుండడంతో సామాన్యులకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా మంచిర్యాలలో రోజు గొడవలు జరుగుతూనే ఉన్నాయి. పలు భూ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకుని బాధితులను బెదిరించిన ఘటనలున్నాయి.



యోగాలో రాణిస్తున్న ఆమని

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో బంగారు పతకాలు

ఓలింపిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించడమే లక్ష్యం

ప్రభుత్వం ప్రొత్సాహం అందించాలి

7

అర్ధరాత్రి సీపీ ఆకస్మిక తనిఖీలు



వృద్ధురాలిని విచారిస్తున్న సీపీ

కోల్‌సిటీ, మార్చి 11 (ఆంధ్ర జ్యోతి): రామగుండం పోలీస్ కమిష నర్ అంబర్ కిషోర్ మంగళవారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించారు. రామగుండం రైల్వేస్టేషన్, పోలీస్ స్టేషన్, గోదావరిఖని బస్టాండ్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఆకస్మి కంగా పర్యటించారు. సీపీగా బాధ్యతలు స్వీకరించిన అంబర్ కిషోర్ ఝా పోలీ సుల పెట్రోలింగ్, గస్తీని పరిశీలించా రు. రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో ప్రయా ణికులతో మాట్లాడారు. రామగుండం పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసి జీడీ బుక్‌ను పరిశీలించారు. స్టేషన్‌లో ఉన్న సిబ్బంది వివరాలు, విధులను తెలుసుకున్నారు.

రామగుండాన్ని బిజినెస్ హబ్‌గా అభివృద్ధి చేస్తాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రామగుండం పునర్ నిర్మాణ దిశగా కార్యాచరణ అమలు చేస్తున్నామని, రామగుండం నగరాన్ని బిజినెస్, మెడికల్ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. మంగళవారం మెయిన్ చౌరస్తాలో సింగరేణి ఆధ్వర్యంలో రూ.15 కోట్లతో నిర్మించ తలపెట్టిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతంలో విధ్వంసం జరిగిందని, యువత ఉపాధి లేక నష్టపోయారన్నారు. వ్యాపార రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా ఈ ప్రాంతంలో ఉపాధి కల్పించేందుకు సింగరేణి నుంచి రూ.15కోట్ల నిధులు తీసుకువచ్చి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తు న్నామన్నారు. ఏ ఒక్క పేదవాడికి నష్టం కాకుండా కాంప్లెక్స్ నిర్మించి వారికి అవకాశం ఇవ్వనున్నామన్నారు. 8నెలల్లో కాంప్లెక్స్ నిర్మాణ పనులు పూర్తవు తాయని తెలిపారు.

సెంటినరీకాలనీ నుంచి గోదావరిఖనికి రూ.23కోట్లతో నాలుగు లైన్ల రహదారి నిర్మిస్తామన్నారు. రూ.200 కోట్లతో అంతర్జాతీయ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూ రైందని, అలాగే రూ.80 కోట్లతో ఆర్అండ్‌బీ నిధులతో చేపట్టనున్న పను లు టెండర్ దశలో ఉన్నా యన్నారు. ఎన్‌టీపీసీ మూడు యూనిట్లు, జెన్‌కోకు సంబంధించి 800మెగావాట్ల యూనిట్, సింగరేణి సంపడ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ పనులు త్వరలోనే ప్రారంభం జరుగుతాయన్నారు. తనను లక్ష్యంగా చేసుకుని కొందరు స్వార్థపరులు చేస్తున్న ఆరోపణలకు అభివృద్ధిని చూస్తున్న ప్రజలే సమాధానం చెబుతారన్నారు. ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్, డీజీఎం(పర్సనల్) కిరణ్‌బాబు, ఆంజనేయులు, ఆంజనేయప్రసాద్, వరప్రసాద్, హన్మంతరావు, దుర్గాప్రసాద్, ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్, నాయకులు మహంకాళి స్వామి, బొంతల రాజేష్, దీటి బాలరాజు, మారెల్లి రాజిరెడ్డి, తిప్పారపు శ్రీనివాస్, గట్ల రమేష్, పెద్దెల్లి ప్రకాష్, పోలుసాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

కరీంనగర్ జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. సైదాపూర్ మండలం వెంకటేశ్వర్లపల్లిలో యువకుడు, సైదాపూర్ మండలంలోని ఆకునూర్ భూషణగట్ల వద్ద ఓ వ్యక్తి, మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు.

మనస్తాపంతో యువకుడు..


కరుణాకర్ (ఫైల్)

సైదాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన బొడిగ కరుణాకర్ (38) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన బొడిగ కరుణాకర్ ఈ నెల 9న ఆకునూర్ గ్రామానికి వెళ్లాడు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, ఒక మహిళతో పాటు పలువురు విచక్షణారహితంగా దాడి చేశారు. మనస్తాపానికి గురైన కరుణాకర్ పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి రాంబాబు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సైదాపూర్ ఎస్‌ఐ తిరుపతి తెలిపారు.

అనారోగ్య సమస్యలతో ఒకరు..


నర్సింహాచారి (ఫైల్)

సైదాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఆకునూర్ భూషణగట్ల వద్ద బండోజు నర్సింహాచారి (53) అనే వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామానికి చెందిన బండోజు నర్సింహాచారికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నర్సింహాచారికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఖరీదైన వైద్యం చేయించుకోలేక జనవరి 8న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకు ఇంటికి రాకపోయే సరికి కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాగా సోమవారం ఆకునూర్ గ్రామశివారులోని భూషణగట్ల వద్ద ఉరేసుకొని ఉన్న మృతదేహం కనిపించడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ తిరుపతి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని వివరాల సేకరించారు. మృతుడి అల్లుడు ఓంప్రకాష్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు.

మానసికస్థితి సరిగా లేక ఓ వ్యక్తి..

మానకొండూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన పోలం అంజయ్య (53) అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అంజయ్యకు కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేకపోవడంతో కరీంనగర్‌లోని పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినట్లు తెలిపారు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి పడుకున్న అంజయ్య తెల్లవారే సరికి ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందిన తీరును పరిశీలించారు. మృతుని కుమారుడు రఘు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మల్యాల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్ళిన ఓ ఇంట్లో దొంగలు తాళాలు పగులగొట్టి బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన మల్యాలలో చోటు చేసుకుంది. మల్యాల మండల కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన అస్మ సుల్తానా కుటుంబసభ్యులు ఈ నెల 6వ తేదీన జగిత్యాలలోని బంధువుల ఇంటికి వెళ్లారు. కాగ మంగళవారం ఇంటికి రాగ తాళం పగులగొట్టి ఉండి ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురై కనిపించాయి. బీరువాలోని రూ.25వేల నగదుతో పాటు అయిదు తులాల బంగారు నగలను దొంగలు ఎత్తుకెళ్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై నరేశ్‌కుమార్ సంఘటన స్థలం పరిశీలించి దర్యాప్తు జరుపుతున్నారు.

జ్వరంతో పదో తరగతి విద్యార్థిని మృతి


రమ్య(ఫైల్)

హుజూరాబాద్ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన బండారి రమ్య(14) అనే పదో తరగతి విద్యార్థిని తీవ్రజ్వరంతో మంగళవారం మృతి చెందింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బండారి పెద్ద రమేష్-సంపూర్ణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రమేష్ జమ్మికుంటలో వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చిన్నకుమార్తె బండారి రమ్య గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. 20 రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుండగా చికిత్సకోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లిన తగ్గలేదు.

సోమవారం రాత్రి తీవ్రజ్వరం రావడంతో చికిత్సకోసం ఉదయం ఆసుపత్రికి తీసుకెళ్దామని అనుకునే లోపు మంగళవారం మృత్యువాత పడింది. నిరుపేద కుటుంబం కావడం మూలంగా సరైన చికిత్స అందక బాలిక మృతి చెందటంపై గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'బోరు'మంటున్నారు..

- అడుగంటిన జలాలు.. కాలిపోతున్న మోటార్లు..
- పంటలను కాపాడుకునేందుకు రైతుల అవస్థలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు అడుగంటిపోయాయి.. వ్యవసాయ బోరు మోటార్లపై లోడ్ ఎక్కువై కాలిపోతున్నాయి. దీంతో సాగునీరు అందక ఎండుతున్న పంటలను చూసి రైతులు 'బోరు'మంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు పంటలను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. పొట్ట దశకు వచ్చిన పంటకు సాగు నీరు అందిస్తే దిగుబడి వస్తుందనే ఆశతో రేయింబవళ్లు శ్రమిస్తున్నారు.


వ్యవసాయ బోరు మోటారును పైకి తీస్తున్న కూలీలు

కాలుతున్న బోరు మోటార్లు..

మండలంలోని గుండారం, రాజన్నపేట, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, అల్మాస్‌పూర్, దేవునిగుట్టతండా, వెంకటాపూర్, రాచర్ల తిమ్మాపూర్, బాకురుపల్లి తండా తదితర గ్రామాల్లోని రైతులు వరి పంటలను సాగుచేశారు. నాటు పూర్తయిందని అనుకున్న రైతుల గుండెల్లో అడుగంటిన జలాలు ఆందోళన కలిగించాయి. ధారలా వస్తున్న నీరుతో తడులు పారక పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. 24 గంటల పాటు వ్యవసాయ బోరు మోటార్లు నడిచేలా ఆటో స్టార్టర్లను బిగించారు. దాంతో నీరు అందక.. నాణ్యమైన విద్యుత్ సరఫరా కాక మోటార్లు కాలిపోతున్నాయి. చేసేదేమీ లేక వేల రూపాయలు వెచ్చిస్తున్నారు. ఒక్కో రైతు సుమారు రూ.8 నుంచి రూ.10 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. మండలంలో ఇప్పటికే సుమారు 120 మందికి చెందిన వ్యవసాయ బోరు మోటార్లు కాలిపోయాయని బాధిత రైతులు పేర్కొన్నారు. ఒక్కో రైతు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు వెచ్చిస్తున్నారని వాపోతున్నారు. కాలిపోయిన బోరు మోటార్ల మరమ్మతుల కోసం సుమారు రూ.9.60 లక్షలు ఖర్చు చేశారని చెబుతున్నారు. అప్పులు చేసి పంటను దక్కించుకునేందుకు అవస్థలు పడినా పెట్టుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

కెపాసిటర్లు బిగించుకోవాలి..

పృథ్వీధర్, సెస్ ఏఈ



మండలంలోని రైతులు వ్యవసాయ బోరు మోటార్లకు ఆటో స్టార్టర్లను బిగించడం వల్ల కరెంటు ఉన్నంత సేపు మోటార్లు నడుస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నీరు అందక మోటార్లు కాలిపోతున్నాయి. బోరు మోటార్లు కాలిపోకుండా కెపాసిటర్లను బిగించుకోవాలి.


బోరు మోటార్లకు మరమ్మతు చేస్తున్న మెకానిక్‌లు

కూలీలు, మరమ్మతులకు రూ.9 వేలు వెచ్చించా..

గూడెపు నర్సయ్య, రైతు, గుండారం



నాకున్న భూమిలో రెండు వ్యవసాయ బోరు బావులున్నాయి. వాటిపై ఆధారపడి రెండెకరాల్లో వరి పంటను సాగు చేశా. ఓ బోరు ఎత్తేసింది. ఉన్న ఒక్క బోరు బావి అందిస్తున్న నీటితో తడులు పెడుతున్నా. పంట పొట్ట దశకు వచ్చింది. బోరు మోటారు కాలిపోయింది. మోటారు తీసేందుకు రూ.4 వేలు చెల్లించి బయటకు తీయించా. గొల్లపల్లిలోని రిపేరు షాపునకు తీసుకువచ్చాను. మరమ్మతుకు మరో రూ.5 వేలు అయ్యాయి. కూలీలు, మరమ్మతులకు మొత్తం రూ.9 వేలు ఖర్చు చేశా. పంట చేతికందినా పెట్టుబడులు, ఖర్చులు కూడా వచ్చేట్టు లేవు.

కాలువలో పడి వ్యక్తి మృతి


వెంకటేష్ (ఫైల్)

కోల్‌సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని శ్రీనగర్‌కాలనీ నుంచి మున్సిపల్ హెడ్ వర్క్స్ రహదారిలో మల్కాపూర్ శివారు నాలాలో పడి మానాల వెంకటేష్ (47) అనే వ్యక్తి మృతి చెందాడు. మంగళ వారం ఉదయం పనికి వెళ్లేందుకు స్కూటీ పై వెళుతుండగా ప్రమాదవశాత్తు అందులో పడ్డాడు. గతంలో గోదావరి వరదలకు కాలువ వద్ద కూలిపోయింది. దీంతో ప్రమాదవశాత్తు వెంకటేష్ అందులో పడిపోయాడు. భార్య స్వప్న, కూతుర్లు రష్మిక, హారిక ఉన్నారు. వెంకటేష్ భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కే రమేష్ పేర్కొన్నారు.

బైక్ ఢీకొని సైక్లిస్టు మృతి

సిరిసిల్ల క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన నాయిని రాజయ్య(59) మానేరు బ్రిడ్జి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం... రాజయ్య తన సైకిల్‌పై వెల్జిపూర్ గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో మానేరు బ్రిడ్జి వద్ద వెనుకవైపు నుంచి అతివేగంగా వచ్చిన బుల్లెట్ వాహనం ఢీకొంది. తీవ్రగాయాలతో ఉన్న రాజయ్యను చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై రమేశ్ పిర్యాదు మేరకు ప్రమాదానికి కారకుడైన కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన శీతల్లి మనోహర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

గంజాయి చాక్లెట్లు పట్టివేత

కరీంనగర్ క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ హౌజింగ్ బోర్డు కాలనీలో కరీంనగర్ మూడో ఠాణా పోలీసులు మంగళవారం నిర్వహించిన తనిఖీలలో కిలోన్నర గంజాయి చాక్లెట్‌లు పట్టుబడ్డాయి. మూడో ఠాణా పోలీసుల వివరాల ప్రకారం... హౌజింగ్ బోర్డు కాలనీలోని ఓపెన్ జిమ్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద ఆరు ప్యాకెట్లలో 1 కిలో 460 గ్రాముల గంజాయి చాక్లెట్‌లు పట్టుబడ్డాయి. గంజాయి చాక్లెట్లతో పట్టుబడినవారిలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బస్తీ జిల్లా నౌవా గ్రామానికి చెందిన మహేష్‌కుమార్ గౌతం(40) అనే వ్యక్తి ప్రస్తుతం కాపువాడలో నివాసం ఉంటున్నాడు. మరొకరు మహారాజ్ గంజ్ జిల్లా కరూపర్ గ్రామానికి చెందిన బబుల్(24) ప్రస్తుతం కరీంనగర్ అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. వీరిద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి నిషేధిత గంజాయి చాక్లెట్‌లతోపాటు రెండు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. హౌజింగ్ బోర్డు కాలనీ ఓపెన్ జిమ్ వద్ద కొందరికి గంజాయి చాక్లెట్లు విక్రయించేందుకు సిద్ధమవుతుండగా పట్టుకున్నామని పోలీసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామ మానేర్ పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీస్‌లు మంగళవారం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన ఎమ్ ప్రశాంత్, కె ప్రశాంత్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

హత్య కేసులో పురోగతి

కరీంనగర్ క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని లక్ష్మీనగర్‌కు చెందిన క్రశీపాయింట్ నిర్వాహకుడు బాలసాని రాము హత్య కేసులో పోలీసులు కొంత పురోగతిని సాధించారు. ఇప్పటికే రాము బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు ఈ కేసుతో సంబంధం ఉన్నట్లుగా అనుమానిస్తున్న కరీంనగర్‌కు చెందిన ఇద్దరిని సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారు ఇచ్చిన సమాచారంతో ప్రధాన నిందితుడైన సంతోష్‌ను పట్టుకునేందుకు స్పెషల్ పోలీసుటీంలు రంగంలోకి దిగినట్లు సమాచారం. సంతోష్ పట్టుబడితే అసలు విషయం వెల్లడయ్యే అవకాశాలున్నాయి. బాలసాని రాము మృతదేహానికి మంగళవారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తిచేసి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

● న్యాయం చేయాలి

తన భర్త రామును డబ్బుల కోసం హత్య చేశారని మృతుడి భార్య లతశ్రీ ఆరోపించింది. తమకు న్యాయం చేయాలని కోరింది. రాముకు సంతపురి సంతోష్ దగ్గరి స్నేహితుడని, శనివారం పదేపదే ఫోన్ చేయడంతో రూ.25 వేల వరకు నగదు, ఏటీఎం కార్డును తీసుకొని సంతోష్ గదికి వెళ్లాడని తెలిపింది. డబ్బుల కోసమే రామును హత్య చేశారని అతడి సోదరుడు ఆరోపించాడు.

ప్రమాదవశాత్తు 17వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ మృతి


నివాళులర్పిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఇన్‌సెట్‌లో గంగారం(ఫైల్)

సిరిసిల్ల క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం లోని వెంకట్రావునగర్‌లోని ఓ మూడంతస్థుల భవనంపై నుంచి ప్రమాదవశాత్తు లిఫ్ట్ గోతిలో పడి సర్ధాపూర్ 17వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ తోట గంగారాం (59) మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి 10.30గంటలకు తన స్నేహితుడైన సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి కూతురు మృతిచెందగాగా అద్దెకు ఉంటున్న అపార్ట్‌మెంట్‌కు అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావుతో కలిసి అడిషనల్ కమాండెంట్ గంగారాం వెళ్లారు. తిరిగి వెళుతున్న క్రమంలో బటన్ నొక్కగా సేఫ్టీ గేట్ తెరుచుకుంది. లిఫ్ట్ వచ్చిందనుకొని ముందుకు అడుగువేయగా ప్రమాదవశాత్తు ఒక్కసారిగా గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న లిఫ్ట్‌పై పడి చాతి, ఎడమకాలు, ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. అక్కడే ఉన్న మిగతా పోలీస్ అధికారులు అగ్నిమాపక సిబ్బంది సహకారంతో గంగారాంను బయటకు తీసి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందారు. తెలంగాణ సచివాలయంలో సీఎస్‌వోగా పనిచేసిన 1989బ్యాచ్‌కు చెందిన గంగారాం సిరిసిల్ల పట్టణంలోని సర్ధాపూర్ 17వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్‌గా మూడునెలల క్రితమే విధుల్లో చేరారు. మరో రెండేళ్లలో రిటైర్ కావాల్సి ఉంది. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలోని సిద్దులం గ్రామానికి చెందిన గంగారాం హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. గంగారాంనకు భార్య రేఖ, కొడుకు సతీష్‌కుమార్, ఇద్దరు కూతుళ్లు గౌతమి, మీనల్‌లు ఉన్నారు. ఈ సంఘటన తెలుసుకున్న కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులు సిరిసిల్లకు తరలివచ్చి విలపించడంతో జిల్లా ఆసుపత్రి వద్ద విషాదం అలుముకుంది. సంఘటనపై మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

● శ్రద్ధాంజలి ఘటించిన కలెక్టర్..

అడిషనల్ కమాండెంట్ గంగారాం పార్థివదేహానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయనతో పాటు అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, 1వ, 3వ బెటాలియన్ కమాండెంట్‌లు మురళీకృష్ణ, జమీల్‌పాష, 17వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు, రాందాస్, అధికారులు, సిబ్బంది పుష్పాంజలి ఘటించారు.

ప్రియురాలు పట్టించుకోవడం లేదని..

- టవర్ ఎక్కిన ట్రాక్టర్ డ్రైవర్
- పోలీసుల చొరవతో సుఖాంతం


ఎన్టీపీసీలో టవర్ ఎక్కిన అజయ్

జ్యోతినగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రియురాలు తనను పట్టించుకోవడం లేదనే కారణంతో అజయ్ అనే ట్రాక్టర్ డ్రైవర్ మంగళవారం ఎన్టీపీసీ మేడిపెల్లి సెంటరులోని హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కాడు. మూడు గంటలపాటు అందరిని హైరానాకు గురి చేశాడు. చివరికి ఎన్టీపీసీ పోలీసులు చొరవ తీసుకొని ప్రియురాలిని రప్పించి అజయ్‌కు నచ్చజెప్పడంతో టవర్ దిగాడు. స్థానిక పీకే రామయ్య కాలనీకి చెందిన అజయ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అజయ్ రామగుండంకు చెందిన కూలీ పనులు చేసుకునే ఒక మహిళతో సఖ్యత ఏర్పడింది. అయితే నిత్యం మద్యం తాగి వచ్చి మహిళను వేధిస్తున్నాడు. దీంతో ఆ మహిళ అతన్ని పట్టించుకోవడం మానేసింది. తనతో మాట్లాడడం లేదని, పట్టించుకోవడం లేదనే మనస్తాపంతో మంగళవారం అజయ్ టవర్ ఎక్కాడు. ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్ ఎంత ప్రయత్నించినా కిందకు దిగలేదు. చివరికి సదరు మహిళను పిలిపించి సముదాయించడంతో టవర్ దిగాడు. అజయ్‌ను ఎన్టీపీసీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


గంగాధర్ (ఫైల్)

చందుర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతిచెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. చందుర్తి మండలం మల్యాల గ్రామం చెందిన పోతరాజు గంగాధర్ (45) అనే వ్యక్తి ఈనెల 8న చందుర్తి నుంచి మల్యాలకు బైక్‌పై వెళుతున్నాడు. సనుగుల గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తి మల్యాల నుంచి చందుర్తికి బైక్ వెళ్తుండగా వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిలోని ఎల్లంపల్లి కాల్వ సమీపంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో గంగాధర్‌కు తీవ్రగాయాలు కాగా హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు గంగాధర్ బావ బుర్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

పరిశ్రమల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి


మాట్లాడుతున్న డీవైసీఎఫ్ వై గంగాధర్‌రెడ్డి

జ్యోతినగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల యాజమాన్యాలు భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్(కరీంనగర్) వై గంగాధర్‌రెడ్డి అన్నారు. ఎన్టీపీసీలో నిర్వహిస్తున్న జాతీయ భద్రతా వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఏడీఎం బిల్డింగ్ ఆవరణలో జరిగిన ముగింపు కార్యక్రమానికి గంగాధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భద్రతా వ్యవస్థ బాగుంటేనే పరిశ్రమ అభివృద్ధి చెందుతుందన్నారు. భద్రత విషయంలో ఉద్యోగులను చైతన్యవంతుల్ని చేసే బాధ్యత యాజమాన్యాలపైనే ఉందని తెలిపారు. ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత మాట్లాడుతూ భద్రతతో కూడిన విద్యుత్ ఉత్పత్తికి కృషి చేస్తున్నామన్నారు. భద్రతా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. సీఐఎస్‌ఎఫ్ సీనియర్ కమాండెంట్ ముకేష్ కుమార్, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



విజేతకు బహుమతి అందజేస్తున్న ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్

మొన్న కొండాపూర్.. నేడు సూరంపేటలో..

- పెద్దపులి కదలికలతో ఆందోళనలో ప్రజలు
- అప్రమత్తం చేసిన అటవీ అధికారులు


ప్రజలతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

కొడిమ్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో మొన్న కొండాపూర్ గ్రామ శివారులో నేడు సూరంపేట అడవిలో పెద్దపులి కదలికలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని సూరంపేట, గంగారాంతండా అడవిలో మంగళవారం పెద్దపులి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. అడవిని ఆనుకొని ఉన్న నర్సరీలో మొక్కలకు నీటిని పోయటానికి బూక్య దీప్తి, బూక్య గోరీ అనే ఇద్దరు ఉపాధిహామీ కూలీలు వెళ్లారు. పెద్దపులిని గోరీ అనే మహిళ పరిగెత్తగా కింద పడి స్వల్పంగా గాయాలైనట్లు అటవీ అధికారులు తెలిపారు. గ్రామస్థులు పెద్దపులి కదలికలపై అటవీ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కొడిమ్యాల రేంజర్ గులాం మొయినుద్దీన్, డీఆర్వో ముషీర్‌అహ్మద్, పలువురు బీట్ అధికారులు పెద్దపులి కనిపించిన అటవీ స్థలానికి వెళ్లారు. సూరంపేట, గంగారాంతండా ప్రజలకు కనిపించింది ఏమిటని, ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. కొందరు పెద్దపులి అనగా, మరికొందరు చిరుతపులి అని సమాధానమిచ్చారు. అటవీ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేంజర్, డీఆర్వో, సిబ్బంది అవగాహన కల్పించారు. గత జనవరి 24న మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో ఆవుపై పెద్దపులి దాడి చేసి చంపింది. నాలుగురోజుల క్రితం మండలంలోని దమ్మయ్య పేట-రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామ శివారులో గేదెపై పెద్దపులి దాడి చేసిందన్న వదంతులు వినిపించాయి. కొడిమ్యాల మండలంలోని సూరంపేట గంగారాం తండా అడవిలో పెద్దపులి సంచారం సమాచారంతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. పులి అడుగుల జాడ కోసం అటవీ అధికారులు సిబ్బంది గాలిస్తున్నారు. కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్, డీఆర్వో ముషీర్‌అహ్మద్, కొడిమ్యాల, మల్యాల మండలాల ప్రజలను అప్రమత్తం చేశారు.

ఈ విషయమై కొడిమ్యాల రేంజర్ గులాం మొయినుద్దీన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పెద్దపులి కదలికలు ఉన్నట్లు తాము తెలుసుకున్నామన్నారు. పెద్దపులి సంచరించిన ఆనవాళ్లు, ఆధారాలు పూర్తిగా లభిస్తే పూర్తి నిర్ధారణ చేస్తామన్నారు. పెద్దపులి కొడిమ్యాల మండలంలోని సూరంపేట, గంగారాంతండా అడవిలో సంచరిస్తున్నట్లు బావిస్తున్నామని తెలిపారు. ప్రజలు, రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

శతాధిక వృద్ధురాలి మృతి


నర్సవ్వ (ఫైల్)

చందుర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం లింగంపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బండారి నర్సవ్వ (102) వయోభారంతో మంగళవారం మృతి చెందింది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. నర్సవ్వకు ఆరుగురు సంతానం. ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో ఒక కుమార్తె మృతి చెందింది.

రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కల్వల రోడ్డులో పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకొని పోలీస్‌స్టేషన్ తరలించారు. ఆటోలో 10 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సూల్తానాబాద్ మండలం గట్టెపల్లికి చెందిన ఆటో యజమాని మానుపటి జయశంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

యోగాలో రాణిస్తున్న ఆమని


అంతర్జాతీయ స్థాయిలో సాధించిన బంగారు పతకంతో ఆమని



జాతీయ స్థాయిలో ఐదవ స్థానం సాధించినందుకు..



తెలంగాణ జిల్లాల స్థాయి యోగా పోటీలలో గోల్డ్ మెడల్ అందుకుంటూ..

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో బంగారు పతకాలు

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి

సుల్తానాబాద్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణం మార్కండేయ కాలనీకి చెందిన జాపతి ఆమని యోగా పోటీలలో రాణిస్తోంది. యోగాలో రెండేళ్ల పాటు శిక్షణ పొందిన ఆమె జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొంటూ పతకాలు సాధిస్తోంది. నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి యోగా పోటీల లో బంగారు పతకం సాధించి రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప జేసింది. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీలలో పాల్గొం టూ ఇప్పటివరకు ఐదు బంగారు పతకా లు సాధించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి 16 వరకు కేరళ రాష్ట్రం త్రివేంద్రం లో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీలలో రాష్ట్రం తరఫున పాల్గొంది. ఈ పోటీలలో ఐదవ స్థానాన్ని సాధించి కేరళ ముఖ్య మంత్రి చేతుల మీదుగా పతకాలను అందు కున్నారు. ఈ పోటీలలో దేశం నుంచి ఆరుగురిని మాత్రమే ఎంపిక చేయగా తనకు ఐదవ స్థానం దక్కిందని ఆమని తెలిపారు.



అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం

గతేడాది నేపాల్‌లో జరిగిన ఓపెన్ ఇంటర్నేషనల్‌లో ఆమని పాల్గొని బంగారు పతకం సాధించింది. 2023లో గోవాలో కేంద్ర ప్రభుత్వం ఆయుష్ శాఖ తరఫున నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలలో బంగారు పతకం సాధించింది. పంజాబ్ రాష్ట్రం అమృత్ సర్‌లో యోగా ప్రచార సమితి ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో గోల్డ్ మెడల్ వచ్చింది. కలకత్తాలో తెలంగాణ యోగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో ఫెడ రేషన్ కప్ సాధించింది. కలకత్తాలో జరిగిన ఫెడరేషన్ పోటీలలో రెండుసార్లు అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఆమని ఎంపికైంది. పంజాబ్‌లో ఖేల్ యువరత్న పురస్కార్ అవార్డు అందుకొంది. కరీం నగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో గోల్డ్ మెడల్ సాధించింది.



బంగారు పతకమే లక్ష్యం

జాపతి ఆమని, అంతర్జాతీయ యోగా క్రీడాకారిణి

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన యోగా పోటీలలో పాల్గొని ప్రతిభను నిరూపించుకున్న. ప్రస్తుతం ఆసియన్ గేమ్స్, ఒలింపిక్స్ లక్ష్యంగా ఎదురుచూస్తున్నా. ఒలిం పిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించి దేశ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం గా ఇనుమడింప జేయాలని ఉంది. అందుకు కఠోర శిక్షణ పొందుతున్నా. రెఫరీ కోసం రాసిన పరీక్షల్లో సెలక్ట్ అయినా దానిని కాదనుకుని ఒలంపిక్స్‌లో పాల్గొనడమే లక్ష్యంగా ఉన్నా.

యోగాలో పతకాల పంట పండించాలి

చెలుకు వాసుదేవరెడ్డి, యోగా నిపుణులు

యోగా పోటీలలో పతకాల పంట పండించాలి. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న యోగా క్రీడాకారులు క్రీడా ప్రతిభను చాటుకోవడం, పతకాలు సాధించడం అభినందనీయం. ప్రభు త్వం యోగాను ఒక క్రీడగా గుర్తిం చింది. ఎందరో యోగా క్రీడాకా రులు స్పోర్ట్స్ సర్టిఫి కెట్లతో ఉన్నత స్థాయిలో ఉన్నారు. యోగాతో మానసిక ప్రశాం తత చేకూరి దినచర్య ఆటంకాలు లేకుండా సాగుతుంది.

అసంతృప్తి లేదు

మళ్లీ ఎమ్మెల్సీ అవకాశం రాకపోవడంపై

- సామాజిక సమీకరణాల నేపథ్యంలో పదవి దక్కలేదు
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి రాకపోవడంపై తనకు ఎలాంటి అసంతృప్తి లేదని, సామాజిక సమీకరణల నేపథ్యంలో రాలేదని భావిస్తున్నానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పదవు లతో సంబంధం లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్నారు. రాజకీయాల్లో ముందస్తు హామీలు ఉండవని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు జీవన్‌రెడ్డి సమాధానం చెప్పారు. జగిత్యాలలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలన్నారు. పసుపు, మొక్కజొన్న, కంది పంటలకు మద్దతు ధర కల్పించాలని, మొక్క జొన్న, పసుపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇసుక అందుబాటులో లేకపోవ డం వల్ల నిర్మాణ రంగం కుంటుపడింద న్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మా ణానికి ఇసుక అందుబాటులో ఉంచిందని, జిల్లాలో అక్రమ ఇసుక దంపులపై కలెక్టర్ చొరవ చూపడండం అభినందనీ యమన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుతో పసుపు పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు ఆశిస్తే మరింత ధర తగ్గడంతో ఆందోళన చెందుతు న్నారని జీవన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, కాంగ్రెస్ నాయకులు శీలం సురెందర్, కండ్లపెల్లి దుర్గయ్య తదతరులు పాల్గొన్నారు.

బద్దిపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


బద్ది పోచమ్మ ఆలయం వద్ద క్యూలో భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ అనుబంధ శ్రీబద్ది పోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెల కొంది. అమ్మవారికి భక్తులు ఉదయాన్నే మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్లు, శివసత్తుల నృత్యాల మధ్య ఊరే గింపుగా ఆలయానికి తరలి వచ్చారు. భక్తు లు పెద్ద సంఖ్యలో మొక్కులు చెల్లించుకు నేందుకు రావడంతో క్యూలైన్‌లో భక్తులు బారులు గంటల తరబడి నిరీక్షించారు. ఆల యంలోకి చేరుకున్న భక్తులు పట్నాలు వేసి నూతన వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించి అమ్మవారికి నైవేద్యంపెట్టి మొక్కులు చెల్లిం చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్త కుండా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆల య ఇన్‌చార్జి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివపార్వతుల కల్యాణం

కాల్వశ్రీరాంపూర్, మార్చి 11 (ఆంధ్ర జ్యోతి): మల్యాల గ్రామంలోని విశ్వేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శివ పార్వతుల కల్యాణం ఆలయ అర్చకులు నిట్టూరి సతీష్‌శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సం దర్భంగా ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి లెక్కల కవిత శ్రీనివాస్‌రెడ్డి, కామిడి పద్మశ్రీనివాస్‌రెడ్డి దం పతులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనం తరం అన్నదానం నిర్వహించారు. శివాల యం కమిటీ అధ్యక్షుడు కాసర్ల మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు బసవత్తుల జ్ఞానేంద్ర చారి, కోశాధికారి ఉప్పుల రమేష్, కసార్ల సాగర్ రెడ్డి, సంజీవరెడ్డి, ఎర్రబాటి రవి, బూసి సదా శివరెడ్డి, కూనారం రమేష్, శీలం మల్లారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

ఇల్లందకుంట: మండలంలోని చిన్న కోమటిపల్లిలో వెలిసిన స్వయంభూ లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్ర హ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీనర్సింహస్వా మిని పట్టువస్త్రాలతో అలంకరించి హను మాన్ దేవాలయంలో ఎదుర్కోళ్లను నిర్వ హించారు. గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయ అర్చకులు ప్రదీప్‌శర్మ, నవీన్‌శర్మల ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ చిట్ల చంద్రమౌళి దంపతులు, చుక్క అరుణ రాణి- రం జిత్‌కుమార్, చుక్క రజిత-వేణు గోపాల్ స్వామివారికి కల్యాణ పట్టు వస్త్రాన్ని సమర్పించారు. అనంతరం చుక్క అరుణ రాణి- రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమం లో ఆలయ చైర్మన్ చం ద్రమౌళి, వైస్‌చైర్మన్ రమేష్, కోశాధికారి వెంకటేశ్వర్లుపాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం

గంగాధర: మండలంలోని ఉప్పర మల్యాల తుమ్మెద గుట్ట లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు.

- గర్షకుర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మో త్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం స్వామికి హవనం, బలిహరణం, బేరిపూజ నిర్వహించారు.

వైభవంగా నృసింహుడి కల్యాణం

తిలకించిన వేలాది మంది భక్తులు

పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి



ధర్మపురిలో శేషప్ప కళావేదికపై శ్రీ లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవం, తిలకిస్తున్న భక్తజనం

ధర్మపురి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహస్వామి కల్యాణం మంగళవారం సాయంత్రం గోధూళి సుమహూర్తమున అత్యంత వైభవంగా జరిగింది. భారీ గా తరలి వచ్చిన వేలాది మంది భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం నరసింహ నామ స్మరణ చేస్తూ ఆలయానికి చేరుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే కల్యాణోత్సవం పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వరస్వామి వారల ఉత్సవమూర్తులను సాయంత్రం వేళలో ఆలయ వేద పండి తులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చ రణల మధ్య అర్చకులు ఆలయాల నుంచి బయటకు తీసుక వచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన స్థానిక బ్రాహ్మణ సంఘం పక్కనే గల శ్రీ మఠం యాగశాల స్థలంలో ఏర్పాటు చేసిన నూతన కల్యాణ వేదికపైన ఆశీనులు చేశారు. యజ్ఞాచార్యులు కందాళై పురుషోత్తమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవంలో అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, సంతోష్‌కుమార్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, రుత్వికులు సంకల్పం, ఆచమనం, యజ్ఞోప వీతాధారణ, కూడ జీర ధారణ, బాసికం ధారణ, అక్షితారోహణం, కళ్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. యజ్ఞాచార్యులు కందాళై పురు షోత్తమచార్య నేతృత్వంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, అర్చకులు శాస్త్రోక్తంగా సనాతన సంప్రదాయ రీతిలో స్వామివారల కల్యాణోత్సవం జరిపించారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్ కుమార్, పలువురు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ప్రభుత్వ విప్, ధర్మపురి, వేములవాడ ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎస్పీ అశోక్‌కుమార్, ఈవో సంకటాల శ్రీనివాస్, జగిత్యాల ఫస్ట్ క్లాస్ అడిషనల్ మెజి స్ట్రేట్ నారాయణ, ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో రవీందర్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, జక్కు రవీందర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, వేములవాడ దేవస్థానం మాజీ ఈవో దూస రాజేశ్వర్, ఎండోమెంట్ డీఈఈ రఘునందన్ భక్తులు పాల్గొన్నారు.


కల్యాణంలో పాల్గొన్న జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ దంపతులు, ఎస్పీ అశోక్‌కుమార్, ప్రభుత్వ విప్, ధర్మపురి, వేములవాడ ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్

పట్టు వస్త్రాలు సమర్పించిన కలెక్టర్

ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నృసింహ (యోగ, ఉగ్ర), శ్రీ వేంక టేశ్వర స్వామి వారల కల్యాణోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం పక్షాన జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు మంగళవారం సమర్పించారు. అనం తరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ కలెక్టర్ దంపతులకు స్వామి శేషవ స్త్రాలు, ప్రసాదాలు బహూకరించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వామి వారికి పట్టువస్త్రాలు, తలం బ్రాలు సమర్పించారు. మున్సిపల్ కమిష నర్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, మేనేజర్ గంగాధర్, సిబ్బంది ఆలయానికి వెళ్లి స్వామివారలకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, పుస్తె లు, మట్టెలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్‌డీవో మదుసూధన్, డీపీవో మదన్‌మోహన్ ఉన్నారు.

భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి

ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. స్థానిక దేవాలయం వద్ద ఆయన కొద్ది సేపు విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. క్షేత్రంలో పారిశుధ్య నిర్వహణ, వైద్య సౌకర్యం, వాహనాల పార్కింగ్, ఆర్‌టీసీ బస్సుల సౌకర్యం, పోలీస్‌శాఖ బందోబస్తు, ఇతరత్రా ఏర్పాట్లు సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో కొనసాగుతున్నట్లు వివరించారు.

ఘనంగా స్వామివారల ఎదుర్కోళ్లు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర స్వామివారల ఎదుర్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చిలుకముక్కు హరిప్రసాద్ ఇంటికి శ్రీ లక్ష్మీనరసింహ (యోగ,ఉగ్ర) స్వామి వారల ఉత్సవమూర్తులను తీసుకవచ్చారు. అలాగే ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు ఇంటికి శ్రీ వేంకటేశ్వర స్వామివారలను తీసుకవచ్చారు. ఉత్సవమూర్తులకు ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, సంతోష్ కుమార్, రాజగోపాల్ శాస్త్రోక్తంగా పూజలు జరిపి ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.




స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల కలెక్టర్ దంపతులు, ధర్మపురి మున్సిపల్ పక్షాన పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకువస్తున్న కమిషనర్ దంపతులు

గ్రూప్-2లో 24వ ర్యాంకు సాధించిన రాకేష్



ఇల్లంతకుంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి గ్రామా నికి చెందిన గొట్టిపర్తి రాకేష్ గ్రూపు-2లో రాష్ట్రస్థాయిలో 24వ ర్యాంకు సాధించాడు. ఉస్మానియా యూనివర్సిటీల పీజీ చేసిన రాకేష్ నెలరోజుల క్రితమే ఎక్సైజ్‌శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా సిరిసిల్లలో విధులు నిర్వహిస్తున్నాడు.

34వ ర్యాంకు సాధించిన అఖిల్‌రెడ్డి



చందుర్తి: చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామానికి చెందిన ఎగుమామిడి సత్యనారాయణరెడ్డి -ఉమా దంపతుల కుమారుడు అఖిల్‌రెడ్డి గ్రూప్-2లో ఫలితాల్లో 34వ ర్యాంక్ సాధించాడు. అఖిల్‌రెడ్డిని మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు దూది శ్రీనివాసరెడ్డి, నాయకులు, గ్రామస్థులు అభినందించారు.

95వ ర్యాంకు సాధించిన ప్రశాంత్‌రెడ్డి



జమ్మికుంట రూరల్, ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన కాంతాల మల్లారెడ్డి- రజిత దంపతల కుమారుడు సాయి ప్రశాంత్‌రెడ్డి గ్రూపు-2 ఫలితాల్లో స్టేట్ 95వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. ప్రశాంత్‌రెడ్డి గ్రూప్4లో ఉద్యోగం సాధించి రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహి స్తున్నాడు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డిని విస్‌డమ్ జూనియర్ కళాశాల, చాణిక్య డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం, గ్రామస్థులు అభినందించారు.

ప్రతిభ చాటిన భువన



సిరిసిల్ల: సిరిసిల్లలోని అశోక్ నగర్‌కు చెందిన బుర్ర భువన గ్రూప్ పరీక్షల్లో ప్రతిభ చాటింది. సిరి సిల్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బుర్ర కృష్ణప్రసాద్ గౌడ్ కూతురు భువన సోమవారం ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో 456 మార్కులు సాధిం చగా మంగళవారం ప్రకటించిన గ్రూప్-2 ఫలితాల్లో 374 మార్కులతో రాష్ట్రవ్యాప్తంగా 363 ర్యాంక్ పొందారు. గ్రూప్-4లో ఉద్యోగం సాధించి కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ, గ్రూప్-1, గ్రూప్-2 లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచారు.

235 ర్యాంకు సాధించిన సంతోష్



గంభీరావుపేట: గంబీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన మెతుకు సంతోష్ అనే యువకుడు గ్రూప్ 2లో 235 ర్యాంకు సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన మెతుకు సంతోష్ గతంలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. మంగళవారం వెలువడ్డ గ్రూప్ 2 పరీక్ష ఫలితాలు సంతోష్‌కు 380 మార్కులు రాగా, 235 ర్యాంకు వచ్చింది.

చక్కెర కర్మాగారాన్ని తెరిపించాలి

రైతులతో కలిసి బీజేపీ ధర్నా

మెట్‌పల్లిటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని వెంటనే తెరిపించాలని మంగళ వారం మెట్‌పల్లి పట్టణంలో బీజేపీ నాయకు లు రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సం దర్భంగా బీజేపీ నాయకులు డాక్టర్ రఘు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చక్కెర ఫ్యాక్టరీని మూతపడేలా చేసిం దని విమర్శించారు. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయరైందని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నిర్లక్ష్యం కారణంగా దాదాపుగా పది వేల మంది కార్మిక, రైతుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని వారు ఆవే దన వ్యక్తం చేశారు. రైతుల కోసం నిజామా బాద్ ఎంపీ అర్వింద్ కృషి చేస్తున్నారని, అం దులో భాగంగానే పసుపు బోర్డు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. పసుపు రైతుల సంక్షే మానికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. చక్కెర ఫ్యాక్టరీ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రాచ కొండ యాదగిరిబాబు, పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, బీజేపీ నాయకులు ఏలేటి నరేం దర్, చెట్లపల్లి సుఖేందర్ గౌడ్ పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, చెరుకు రైతులు

మద్దతు ధర చెల్లించాలి

పసుపు రైతుల మహాధర్నా

మెట్‌పల్లిటౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : పసుపు పంటకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద మంగళవారం మహాధర్నా నిర్వహించారు. పట్టణంలోని వ్యవసాయ మా ర్కెట్ యార్డు నుంచి శాస్త్రీ చౌరస్తా వరకు రైతులు ర్యాలీగా వచ్చి ధర్నా చేపట్టారు. రెం డు నిమిషాల పాటు మౌనం పాటించి నిర సన తెలిపారు. ఈ సం దర్భంగా రైతులు, రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ పసుపు బోర్డు వచ్చిందని సం తోషపడాలో, పసుపు పంటకు మద్దతు ధర లేదని బాధపడాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నడూ లేని విధం గా పసుపు పంటకు కేవలం రూ.5 వేలు ధర ఉండటంతో పెట్టుబడి కూడా సరిపోవడం లేదన్నారు. రూ.15 వేలు మద్దతు ధర ప్రకటిం చాలని డిమాండ్ చేశారు. అలాగే మార్కెట్ ఇంటర్వేషన్ స్కీంలో పసుపును కలపాలని డిమాండ్ చేశారు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ చేరుకొని సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.


మెట్‌పల్లిలో రైతుల ధర్నా

రైతులకు రూ.52 కోట్ల పంట రుణాలు

కె.శశిధర్‌రావు, సహకార బ్యాంక్ మేనేజర్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ఈ సీజన్‌లో రైతులకు ఏ మేరకు పంట రుణాలు ఇచ్చారు.

మేనేజర్: ఈ సీజన్‌లో రూ 52 కోట్ల పంట రుణాలను రైతులకు ఇచ్చాము. సహకార సంఘాల ద్వారా రైతులు చేసుకున్న ధరఖాస్తు మేరకు రుణాలు మంజూరు చేశాం.

ఆంధ్రజ్యోతి: దీర్ఘ కాలిక రుణాలు ఎంత ఇచ్చారు.

మేనేజర్: దీర్ఘకాలిక రుణాలలో పాడి పశువుల కొనుగోలు, డెయిరీల నిర్వహణ, గొర్రెల పెంపకం, కోళ్ళ పరిశ్రమ, ఉన్నత విద్య, విదేశీ విద్యావకాశాలు, హార్టీకల్చర్ తదితర వాటికి రూ.118 కోట్లు మంజూరు చేశాం.

ఆంధ్రజ్యోతి: రైతులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.

మేనేజర్: సహకార బ్యాంకుల ద్వారా రైతులకు బీమా సౌకర్యం కల్పించాం. పీఎంఎస్‌బీవై ద్వారా ఇరవై రూపాయలకే రెండు లక్షల ప్రమాద బీమా వర్తింప చేస్తున్నాం. రెండున్నర కోట్లతో సొంత భవనం సమకూర్చుకున్నాం. ఏటీఎంను ప్రారంభిస్తున్నాము. డిపాజిట్లపై అత్యధిక వడ్డీ చెల్లిస్తున్నాం. కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకుల ద్వారా రైతులకు సేవలు అందిస్తున్నాం.

- సుల్తానాబాద్

తాగు నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు

పెద్దపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగు నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరా, ఎల్ఆర్ఎస్, ఇందిరమ్మ ఇండ్ల పై అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో నీటి సరఫరా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నివేదిక తయారు చేసుకుని సన్నద్ధంగా ఉండాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరా జరగాలని, ముందుగానే చెక్ చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఇంట్రాలో లీకేజీ, మరమ్మతు పనులు ఉంటే వెంటనే చేపట్టాలని అన్నారు. నీటి పారుదల శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టులలో తాగు నీరు సరఫరాకు వీలుగా వాటర్ లెవల్స్ మెయింటైన్ చేయాలన్నారు. నీటి వృథాను నివారించాలని అన్నారు. ఎల్ఆర్ఎస్ కోసం పూర్తి ఫీజు తో పాటు ఓపెన్ స్పేస్ చార్జీను ఈనెల 31లోపు చెల్లిస్తే 25శాతం రీబెట్ ఇస్తామని తెలిపారు. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతించమన్నారు. నీటి పారుదల శాఖ, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు సమన్వయంతో పని చేసి పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 13 గ్రామీణ మండలాల్లో పైలెట్ గ్రామాన్ని ఎంపిక చేసి మొత్తం 1919ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశామని, ఈ ఇండ్ల నిర్మాణానికి మార్కింగ్ జియో ట్యాగింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లబ్ధిదారులతో అధికారులు చర్చించి పనులు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు.జిల్లాలోని మిగిలిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితా తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈఈ మిషన్ భగీరథ గ్రిడ్ పూర్ణ చందర్‌రావు, ఈఈ మిషన్ భగీరథ ఇంట్రా శ్రీనివాస్, డీపీవో వీర బుచ్చయ్య, జడ్పీ సిఈఓ నరేందర్, హౌసింగ్ పీడీ రాజేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన కరాటే విద్యార్థులను ప్రశంసించిన కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్/కాల్వశ్రీరాంపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కుంగ్ ఫూ కరాటే పోటీలలో జిల్లా విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. వివిధ కేటగిరీలలో 4బంగారు, 2వెండి పతకాలు సాధించారన్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు మూడు బంగారు పతకాలు, కూనారం విద్యార్థులకు ఒక బంగారు పతకం, మంగపేట విద్యార్థులకు రెండు వెండి పతకాలు వచ్చా యని తెలిపారు. విద్యార్థులను, మాస్టర్‌లను కలెక్టర్ అభినందించారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

కోల్‌సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని కోర్టులో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం సతీష్‌పై తప్పుడు కేసులు నమోదు చేశారని, న్యాయవాదులను దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. తౌటం సతీష్, జవ్వాజి శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఖమ్మంపల్లి-భూపాలపల్లి రోడ్డుకు రూ.33.70 కోట్లు మంజూరు

మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలం ఖమ్మంపల్లి నుంచి వయా తాడిచర్ల మీదుగా భూపాలపల్లి రహదారి నిర్మాణానికి జీవో నెం. 113 రూ. ద్వారా 33.70 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మంగళవారం తెలిపారు. ఖమ్మపల్లి-తాడిచర్ల-భూపాలపల్లి రోడ్డు నిర్మాణానికి ఫారెస్టు క్లియరెన్స్‌ను కలుపుకొని ఈ నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈరహదారి నిర్మాణంతో ఖమ్మంపల్లి-తాడిచర్ల-భూపాలపల్లి మధ్య సుమారు 20 కిలోమీటర్ల దూరం తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రజలు, ప్రయాణికుల సౌకర్యం కోసం నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఫారెస్టు క్లియరెన్స్ తోపాటు నిర్మాణానికి నిధులు మంజూరు కోసం కృషి చేసిన మంత్రి శ్రీధర్‌బాబుకు ఖమ్మంపల్లి, తాడిచర్ల, భూపాలపల్లి ప్రాంతాల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ మార్కెట్‌ను ఆధునికీకరిస్తాం

కోల్‌సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థకు చెందిన గోదావరిఖని మున్సిపల్ మార్కెట్‌ను మోడల్ మార్కెట్‌గా ఆధునీకరిస్తామని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. మంగళవారం హోల్‌సేల్, రిటైల్, ఫిష్, మటన్, చికెన్ మార్కెట్‌లను పరిశీలించారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో మార్కెట్‌ను మోడల్ మార్కెట్‌గా ఆధునీకరించేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి వ్యాపారులతో చర్చించారు. వ్యాపారులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎస్ఈ శివానంద్, డీఈ జమీల్, కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, మల్లేష్, తిప్పారపు శ్రీనివాస్, సాంబమూర్తి, గట్ల రమేష్, పాల్గొన్నారు.

పారిశుధ్య వాహనాలు ప్రారంభం

రామగుండం కార్పొరేషన్‌లో రూ.80లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన పారిశుధ్య వాహనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.76లక్షలతో బ్యాక్ హో లోడర్, రూ.4.7లక్షలతో హ్యాండ్ ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో అద్దె వాహనాలు తీసుకుని పనులు చేయించడం వల్ల నిధులు దుర్వినియోగం జరుగుతుందనే ఆరోపణలు ఉండేవన్నారు. కమిషనర్ అరుణశ్రీ, ఎస్ శివానంద్, ఈఈ రామన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, కుమారస్వామి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట

రామగిరి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కల్వచర్లలో మంగళవారం విద్యుత్ అధికారులు పొలం బాట కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో 100 కెవిఎ అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎస్ఈ మాధవరావు చేతుల మీదుగా ప్రారంభించారు. రైతులు ఎవరు ఫ్యూజ్ మార్చవద్దని ఎస్ఈ సూచించారు. రైతులు తమ మోటార్ల వద్ద ఇనుప బాక్స్‌లను వాడవద్దన్నారు. విద్యుత్ ఉన్నతాధికారులను రైతులు సన్మానించారు. డీఈ ప్రభాకర్, ఏడిఏ కనకయ్య, బేగంపేట్ సెక్షన్ ఏఈ మహేందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. రామయ్యపల్లే సబ్‌స్టేషన్‌లో బ్రేకర్స్‌లను ఏర్పాటు చేసి చార్జింగ్ చేపట్టారు. ఎస్ఈ మాధవరావు, డీఈ ప్రభాకర్, ఏడీఈ కనకయ్య, ఏఈ మహేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆశలు గల్లంతు

(5వ పేజీ తరువాయి)

నికి నివేదిక సమర్పించింది. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం కూడా పార్లమెంటు సమావేశాల్లో గతంలో ప్రకటించింది.

● **మరోసారి విన్నవించిన ఎంపీ..**

బసంత్‌నగర్, రామగుండం ప్రాంతంలో గాని విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మంగళవారం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసి మరోసారి విన్నవించారు. దీంతో స్పందించిన ఆయన విమానయాల స్థల ప్రతిపాదనను పరిశీలన చేస్తామని హామీ ఇచ్చారని ఎంపీ గడ్డ వంశీకృష్ణ పేర్కొన్నారు.



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు బొకె అందిస్తున్న ఎంపీ వంశీకృష్ణ తదితరులు

పోచమ్మగుడిలో కౌశిక హరి ప్రమాణం



పోచమ్మగుడి ఎదుట స్నానం చేస్తున్న కౌశిక హరి

గోదావరిఖని, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ బూడిద, ముర్మార్ మట్టి సరఫరాల్లో అవినీతి జరిగిందని, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ హస్తం ఉందని బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి ఆరోపిస్తున్నాడు. ఇటుక బట్టీల యజమానులు కౌశిక హరి డబ్బులు అడిగాడని, అడగలేదంటే తడిబట్టలతో పోచమ్మ గుడిలో ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన కౌశిక హరి మంగళవారం ప్రధాన చరస్తా సమీపంలోని పోచమ్మగుడి ఎదుట స్నానం చేసి తడి బట్టలతో పోచమ్మ దేవాలయంలో ప్రమాణం చేశాడు. అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే ఎదురు దాడి చేస్తున్నారన్నారు. మట్టి, ఇసుక, బూడిద సరఫరాలో వ్యాపారంలో జరుగుతున్న అవినీతిపై ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఎక్కడ చర్చ పెడితే అక్కడికి వచ్చి నిరూపిస్తామన్నారు. అనంతరం ప్రధాన చౌరస్తాలో గాంధీ విగ్రహం వద్ద ధర్నాకు దిగారు. పోలీసుల జోక్యంతో విరమించుకున్నారు. బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో చందర్ మాట్లాడుతూ ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం, బెదిరింపులకు దిగడం మానుకోవాలన్నారు. అభిషేక్‌రావు, మాజీ కార్పొరేటర్లు, ఉన్నారు.

పారదర్శకంగా గ్రామాల అభివృద్ధికి కృషి

ఓదెల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి పారదర్శకంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఇందుర్తి, బాయమ్మపల్లి, కొమిర, ఓదెల గ్రామాలలో రూ.130 కోట్ల నిధులతో నిర్మించనున్న మురికి కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన నిర్వహించారు. మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, ఆళ్ళ సుమన్ రెడ్డి, గోపు నారాయణరెడ్డి, కుమారస్వామి, పాల్గొన్నారు.

త్వరలో అన్ని గ్రామాలకు ఇందిరమ్మ ఇండ్లు

సుల్తానాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో మంగళవారం మండల, పట్టణానికి చెందిన 38 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం 6వ, 7వ వార్డుల్లో రూ. 42 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే అన్ని గ్రామాలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయసంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, తహసీల్దార్ రామచంద్రరావు, మహేందర్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులపై ఏసీపీ విచారణ

కోల్‌సిటీ : గోదావరిఖని కోర్టు ప్రాంగణంలో ఈ నెల 8న జరిగిన గొడవలో నమోదు అయిన అట్రాసిటీ కేసులపై మంగళవారం గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ విచారణ చేశారు. ఇరు పార్టీల నుంచి వివరాలు నమోదు చేశారు.

మంత్రి గారూ... ఇసుక లారీలను నిలిపివేసేదెప్పుడు

రామగిరి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడితే రెండు రోజుల్లోనే ఇసుక లారీలను నిలిపివేస్తామని ఇచ్చిన మాటను మంత్రి మరిచారని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శంకేషిరవీందర్ ప్రశ్నించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే ఇసుకను బంద్ చేస్తామని హామీఇచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇసుక లారీలు నడుస్తున్నాయని ఆరోపించారు. మహదేవ్‌పూర్ నుంచి కమాన్‌పూర్ వరకు నిత్యం వరుస ప్రమాదాలతో అనేక మంది ప్రాణాలు కొల్పోతున్నారన్నారు. కమాన్‌పూర్ వద్ద పోలీసుల కళ్ల ఎదుటే కల్వచర్లకు చెందిన దొంతుల వాణి మృతి చెందిందన్నారు. ఇంకెంత మంది ప్రాణాలు బలైతే ఇసుకను బంద్ చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారయణగౌడ్, నాయకులు కుమార్‌యాదవ్, భాస్కర్, దర్ముల రాజసంపత్, కన్నూరి శ్రీశైలం, దామెర శ్రీనివాస్, సమ్మయ్య పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): ఇసుక లారీలు ఢీకొని మృతి చెందిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబాల్లో ఒక్కరికి ఉద్యోగం కేటాయించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళ వారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఇసుక లారీలతో రహదారులు రక్తసిక్తం గా మారుతూ ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక రవాణాను అరికడుతామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎందుకు నియంత్రించలేకపోతున్నారని మంత్రి శ్రీధర్‌బాబును ప్రశ్నించారు. పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం వేలాది లారీలు నడుస్తున్నాయన్నారు. శంకర్, పొన్నం రాజేశ్వరి, అనిల్‌గౌడ్, వెంకటేష్ లక్ష్మిమల్లు, నాయకులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

గ్రూప్2లో సత్తా చాటిన జూనియర్ అసిస్టెంట్

ధర్మారం, మార్చి11 (ఆంధ్రజ్యోతి): గ్రూప్2 ఫలితాల్లో ధర్మారం గ్రామానికి చెందిన మూటపెల్లి దివ్యశ్రీ సత్తా చాటింది. రాష్ట్ర స్థాయిలో 169వ ర్యాంకు సాధించిన దివ్యశ్రీ, కాళేశ్వరం జోన్ మహిళా విభాగంలో 2వ ర్యాంకు సాధించింది. తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తోంది. తహసీల్దార్ ఎండీ. వకీల్ శాలువాతో సత్కరించి స్వీట్లు తినిపించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ధర్మారం: నర్సింహులపల్లి గ్రామం వద్ద పోలీసులు మంగళవారం ఉదయం టాస్క్ ఫోర్స్ టీంతో కలిసి ఎస్ఐ శ్రీనివాస్ వాహనాల తనిఖీ చేయగా లారీలో తరలిస్తున్న 264.70 క్వింటాళ్ల బియ్యం పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. గురువయ్య, శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ. లక్ష్మణ్ తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో చావా చిత్ర ప్రదర్శన



సుల్తానాబాద్‌లో బీజేపీ నాయకుల ర్యాలీ

సుల్తానాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్‌లోనీ శ్రీరామ మల్టీప్లెక్స్ థియేటర్‌లో చావా సినిమాను బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శించారు. శంబాజి మహరాజ్ జీవిత చరిత్రను తెలుసుకోవాలని హిందుత్వాన్ని కాపాడాలనే ఉద్దేశ్యంతో ఈ సినిమా తీశారని, హిందు బంధువులందరికీ ఉచితంగా ఈ సినిమాను ప్రదర్శించామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం అంబేద్కర్ చౌరస్తా నుంచి పెద్ద ఎత్తున ర్యాలీగా సినిమా థియేటర్‌కు బయలుదేరారు. గొట్టిముక్కల సురేష్ రెడ్డి, కడారి అశోక్ రావు, చౌదరి మహేందర్, కొమ్ము తిరుపతి, చాతరాజు రమేష్, కందుల శ్రీనివాస్, కూకట్ల నాగరాజు పాల్గొన్నారు.

లో ఓల్టేజ్ నివారణకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఎలిగేడు, మార్చి 11,(ఆంధ్రజ్యోతి): వేసవిలో లోఓల్టేజ్ సమస్య ఉత్పన్నం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం శివపల్లిలో 25కేవిఎ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయగా దాన్ని రైతులు, ప్రజల సమక్షంలో ఛార్జ్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సయ్యపల్లి బీసీ కాలనీ, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో 25కేవిఎ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. తిరుపతి, రవి, సంపత్‌కుమార్, శ్రీనివాస్, పాల్గొన్నారు.



వకీల్‌పల్లె గనిని సందర్శించిన డైరెక్టర్



యంత్రాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) కే వెంకటేశ్వర్లు మంగళవారం వకీల్‌పల్లె గనిని సందర్శించారు. సర్వేప్లాన్ ద్వారా గనిలో నడుస్తున్న కంటిన్యూస్ మైనర్, ఎల్‌హెచ్‌డీ పని స్థలాలను, పని పరిస్థితులను, ఉత్పత్తి ఉత్పాదకతల గురించి తెలుసుకున్నారు. మరమ్మతు పూర్తయిన కంటిన్యూస్ మైనర్ యంత్రాన్ని తనిఖీచేశారు. ఉత్పత్తి వినియోగంలోకి వచ్చే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. బంకర్ పనులను పరిశీలించి బొగ్గు రవాణా సకాలంలో జరిగేలా చూడాలని సూచించారు. డైరెక్టర్ వెంట ఆర్జీ-2 ఏరియా జనరల్ మేనేజర్ వెంకటయ్య, ఏరియా ఇంజనీర్ నరసింహరావు, ఏజంట్ నెహ్రూ, మేనేజర్ రవికిరణ్, డీజీఎం వర్క్‌షాప్ ఎర్రన్న, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్, సర్వేయర్ రహమత్‌అలీ, ఎస్ఎస్ఓ షరీఫ్ మహమ్మద్, పిట్ ఇంజనీర్ ఫణికుమార్, డైవైపీఎం శ్యాంప్రసాద్ ఉన్నారు.

ఓసీపీ-5 స్టోర్స్‌ను తనిఖీ చేసిన జీఎం స్టోర్స్



ఓసీపీ-5ని పరిశీలిస్తున్న జీఎం స్టోర్స్(కార్పొరేట్) ఎలీషా

గోదావరిఖని, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియా జీడీకే ఓసీపీ-5ని మంగళవారం జీఎం స్టోర్స్(కార్పొరేట్) ఎలీషా తనిఖీ చేశారు. దానికి సంబంధించి స్టోర్స్‌లో ఉన్న ఇన్వెంటరీ తగ్గించాలని, నాన్ మూవింగ్ ఐటమ్స్ రిటర్న్ చేయాలని లేదా వేరే ఏరియాస్‌కి ప్రొవైడ్ చేయాలని సూచనలను చేశారు. క్వారీని కూడా వ్యూ పాయింట్ ద్వారా సందర్శించారు. ఏరియా ఇంజనీర్ డీవీ రావు, ఓసి-5 స్టోర్స్ ఇన్‌చార్జి డేవిడ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ కే చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ రమేష్, ప్రాజెక్ట్ మేనేజర్ డీ రమేష్, సేఫ్టీ ఆఫీసర్ పీ శ్రీనివాస్, ఎస్ఈ శైలేందర్, డీవైఎస్‌సీ మహేష్ పాల్గొన్నారు.

వచ్చే నెలలో ఎస్‌టీపీపీ పవర్ ప్లాంట్ పనులు ప్రారంభించాలి

గోదావరిఖని, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద గల 1200మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో మరో 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ పనులు వచ్చే నెల ప్రారంభించాలని సింగరేణి సీఎండీ అన్నారు. నిర్మాణానికి టెండర్లు పూర్తి కాగా పనులకు సంబంధించి భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్)తో సింగరేణి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సీఎండీ ఎన్ బలరాంతోపాటు డైరెక్టర్లు డీ సత్యనారాయణరావు, ఎల్‌వీ సూర్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌డీఎం సుభానీ, విద్యుత్ విభాగం ఉన్నతాధికారులు, బీహెచ్‌ఈఎల్ జనరల్ మేనేజర్, హెడ్ పార్థసారధి దాస్, జీఎం జోగేష్ గులాటి, అధికారులు పాల్గొన్నారు. సీఎండీ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయాలని ఒప్పందం ఉన్నప్పటికీ, 40నెలల్లోనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పవర్ ప్రాజెక్టు ప్రాంగణంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని వినియోగించుకుని త్వరితగతిన ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. బీహెచ్‌ఈఎల్ జీఎం పార్థసారథి దాస్ మాట్లాడుతూ సింగరేణి పవర్ ప్లాంట్ పనులను వెంటనే ప్రారంభిస్తామన్నారు.



బీహెచ్‌ఈఎల్‌తో సంస్థతో ఒప్పందం చేసుకుంటున్న సింగరేణి సీఎండీ బలరాం

క్రిటికల్ మినరల్స్ మైనింగ్‌లో పరస్పర సహకారం

బొగ్గు రంగంలో అనుభవం ఉన్న సింగరేణి దేశ అవసరాల దృష్ట్యా క్రిటికల్ మినరల్స్ మైనింగ్‌లోకి అడుగు పెట్టాలని కృత నిశ్చయంతో ఉందని, 60 ఏళ్లుగా ఖనిజాల ఉత్పత్తిలో అంతర్జాతీయ అను భవం ఉన్న జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎం డీసీ)తో కలిసి నడిచేందుకు సంసిద్ధంగా ఉన్నామని సింగరేణి సీఎండీ బలరాం పేర్కొన్నారు. మంగళ వారం సింగరేణి డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో కలిసి ఎన్ఎండీసీ సీఎండీ అమితావ ముఖర్జీ, ఆ సంస్థ డైరెక్టర్లతో సమావేశమయ్యారు. అనుభవం ఉన్న ఎన్ఎండీసీ సహకారం తమకు ఎంతగానో దోహదపడుతుందని సీఎండీ అభిప్రాయపడ్డారు. క్రిటికల్ మినరల్స్ మైనింగ్‌లో మేథో విజ్ఞానాన్ని పంచుకునేందుకు ఐఐటీ-హైదరాబాద్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు. బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి సాంకేతికత, మానవ వనరులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎన్ఎండీసీ సీఎండీ అమితావ ముఖర్జీ మాట్లాడుతూ దేశ ఇంధన అవసరాలు తీర్చడంలో సింగరేణి, ఖనిజ వనరులను జాతికి అందించేందుకు ఎన్ఎండీసీలు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నాయన్నారు. సింగరేణికి సహకరించేందుకు ఎప్పుడూ సంసిద్ధంగా ఉంటామన్నారు. జార్ఖండ్‌లో తమకు దక్కిన బొగ్గు బ్లాక్ లోనూ అవసరమైతే సింగరేణి సహకారం తీసుకుంటామన్నారు. ఎన్ఎండీసీ డైరెక్టర్లు విశ్వనాథ సురేశ్ (కమర్షియల్), వినయ్ కుమార్ (టెక్నికల్), జయ్ దీప్‌దాస్ గుప్తా (ప్రొడక్షన్), ప్రియదర్శిని గడ్డం (పర్సనల్), సింగరేణి డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కే వెంకటేశ్వర్లు(పీపీ), ఈడీ(కోల్ మూమెంట్) ఎస్‌డీఎం సుభానీ, జీఎం(ఫైనాన్స్) సుబ్బారావు పాల్గొన్నారు.

సింగరేణిలో కొత్త గనులు వస్తేనే మనుగడ

గోదావరిఖని, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కొత్త గనులు వస్తేనే మనుగడ కొనసాగుతుందని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆర్‌జీ-1 ఏరియా జీడీకే 11ఇంక్లైన్‌లో మంగళవారం జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో ఇంకో పది సంవత్సరాల్లో గనులు మూతపడనున్నాయని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన బొగ్గు గనుల చట్టం ప్రకారం గతంలో వలే కొత్త గనులు రావడం లేదని ఆయన తెలిపారు. కొత్త గనులు కావాలంటే వేలంలో పాల్గొని దక్కించుకోవాలని కేంద్రం చెబుతుందన్నారు. కార్మికుల సమస్యలను కోడ్ ఆఫ్ డిసిప్లేన్ ప్రకారం యాజమాన్యం నిర్వహించే స్ట్రక్చర్, జేసీసీ సమావేశాల్లో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఏఐటీయూసీ గెలిచిన తరువాత నవంబర్ 28న కొత్తగూడెంలో డైరెక్టర్ (పా) స్థాయి సమావేశం, మార్చి 7న సీఎండీ స్థాయి సమావేశం, 8న జేసీసీ సమావేశాలు జరిగాయన్నారు. సమావేశాల్లో కార్మికుల ముఖ్యమైన సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం అంగీకరించిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయి పడ్డ రూ.33వేల కోట్ల రూపాయలు చెల్లించి సంస్థను రక్షించాలని కోరామని పేర్కొన్నారు. సంస్థలో రాజకీయ జోక్యాన్ని విడనాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సిద్ధమల్ల రాజు అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌లో మడ్డి ఎల్లాగౌడ్, స్వామి, ఆరెల్లి పోషం, మాదన మహేష్, రంగు శ్రీను, ఎస్ వెంకట్ రెడ్డి, గొడిశెల నరేశ్, పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

కాగిత రహిత కార్యకలాపాల పై అవగాహన

రామగిరి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో ప్రవేశపెట్టిన కాగిత రహిత కార్యకలాపాల పై మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. సీఎస్‌సివోపి క్లబ్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఏరియాకు చెందిన వివిధ విభాగాల క్లరికల్ ఉద్యోగులు పాల్గొన్నారు. కాగిత రహిత కార్యకలాపాల నిర్వహణ పై కార్పొరేట్ ఇఆర్‌సి విభాగం సీనియర్ ప్రోగ్రామర్ శంకర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సులభతర కార్యాలయ విధానం అమలు చేయడంలో భాగంగా కాగిత రహిత సేవలను విస్తృత సేవల పై అవగాహన కల్పించారు. యంవిటిసి మేనేజర్ సుజీత్, క్లరికల్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం ప్రతినిధులతో జీఎం సమావేశం



గుర్తింపు సంఘం నేతలతో జీఎం సమీక్ష

రామగిరి, మార్చి 11(ఆంధ్రజ్యోతి):సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపిఏ డివిజన్‌ల గుర్తింపు సంఘం ప్రతినిధులతో మంగళవారం సమీక్ష సమావేశాన్ని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు నిర్వహించారు. ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై గుర్తింపు సంఘం బ్రాంచి సభ్యుడు ఎం.రాంచంద్రారెడ్డి ప్రతినిధులతో చర్చించారు. కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలపై చర్చించారు. జోన్‌లో నీటి పైప్‌లైన్ గుంతలు పూడ్చి, నల్లా కనెక్షన్స్ తిరిగి ఇవ్వడం, క్వార్టర్స్‌కు రంగులు, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రూఫ్‌ల మరమ్మతుపై చర్చించారు. లాంగ్‌వాల్ ఉద్యోగులకు బూట్లు, లాకర్స్ సౌకర్యంతోపాటు క్యాప్ ల్యాంప్స్ విడిభాగాలను అందుబాటుపై చర్చించారు. కమిటీ సభ్యులు రాంచందర్, తిరుపతిరావు, విజయరాఘవ, భాస్కరరాజు, అధికారులు పాల్గొన్నారు.